నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆమనగల్లు, ఫిబ్రవరి 11: ఆమనగల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమత్తుల దృష్ట్యా బుధవారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు ఆమనగల్లు మున్సిపాలిటీతో పాటు పరిధిలోని గ్రామాలు చింతలపల్లి, మంగళపల్లి, మేడిగడ్డ, శంకర్‌కొండ తండా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

బస్టాండ్ పనుల పరిశీలన

నేడు చేవెళ్ల బస్టాండ్ ప్రారంభం

చేవెళ్లలో బస్టాండ్ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 11: చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను నేడు మంత్రులు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. ఈ సందర్భంగా బస్టాండ్‌ను ఎమ్మెల్యే మంగళవారం నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో నిర్మించిన బస్టాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

గ్రంథాలయ జిల్లా సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 11: ప్రభుత్వ నిధులతో గ్రామాలను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్, పెద్దవేడు, నాందార్‌ఖాన్‌పేట్, లింగారెడ్డిగూడ గ్రామాల్లో రూ.55లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ సర్పంచులు శ్రీనివాస్‌గౌడ్, లింగం, శేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఖాజామియా, జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు వెంకట్‌రెడ్డి, కుమ్మరి చెన్నయ్య, నాయకులు దేవేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, దస్తగిరి, కృష్ణ, యాదయ్య, పవీణ్, శ్రీరాములు, సూర్యగౌడ్, రాఘవేందర్, పద్మారెడ్డి, బురాన్ పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి11 : రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన షాద్‌నగర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం షాద్‌నగర్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన షేక్‌గౌడ్ పాషా(47) సోలిపూర్ గ్రామశివారులో రైలు కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. షాద్‌నగర్ రైల్వేస్టేషన్ మాస్టర్ రాహుల్ ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పంచాయతీ కార్మికుడు..

యాదయ్య (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి11 : ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల పంచాయతీ కార్మికుడు యాదయ్య మంగళవారం మృతి చెందారు. 15 సంవత్సరాలు పైగా పంచాయతీలో వాటర్‌మెన్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న యాదయ్య విధి నిర్వహణలో కొంతకాలం క్రితం కిందపడ్డాడు. నాటి నుంచి చికిత్సపొందుతున్న యాదయ్య మంగళవారం మృతి చెందారు. యాదయ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలువాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

శ్రీను నాయక్ (ఫైల్)

మాడ్గుల, ఫిబ్రవరి11: మండల పరిధిలోని అన్నెబోయిన్‌పల్లి గేట్ వద్ద మంగళవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో వ్యక్తి అక్కిడికక్కడే మృతి చెందాడు. మృతుడు రమావత్ శ్రీను నాయక్, రెడ్డికుంట తండా గ్రామం, వెల్దుర్ మండలం, నర్సారావుపేట జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి, హైదరాబాద్ నుంచి తమ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, దేవరకొండ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు సాగర్ రోడ్డుపై అన్నెబోయిన్‌పల్లి గేట్ సమీపంలో ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందినట్లు సీఐ వేణుగోపాల్ రావు తెలిపారు. మృతదేహాన్ని బంధువులకు అప్పజెప్పినట్లు చెప్పారు. కారు డ్రైవర్ ఎస్‌కే కరీముల్లాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

కేశంపేట, ఫిబ్రవరి 11: మండలంలోని పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన ఏర్పుల సీతారాములు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పోమాల్‌పల్లికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏర్పుల సీతారాములు మృతి తమను తీవ్రంగా కలిచివేసిందన్నారు. అధైర్యపడవద్దని, మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే భరోసా కల్పించి ఓదార్చారు. అనంతరం సీతారాములు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ రూ.5వేలు, భూపాల్‌రెడ్డి రూ.5వేలు, రవి పంతులు రూ.3వేలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, లింగం, కృష్ణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హుందాగా మాట్లాడి

గౌరవాన్ని పెంచుకోండి

కేశంపేట, ఫిబ్రవరి 11: అధికారంలో ఉన్నామన్న విషయాన్ని మరిచిపోయి గల్లీలో సాధారణ మనుషులు మాట్లాడలేని వాడుకభాషను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ నేతలు సభల్లో మాట్లాడడం సరికాదని బీఆర్ఎస్ యువ నాయకుడు సాజీద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కేశంపేట మండలంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ వర్గీకరణ విజయోత్సవ సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని మాజీ మంత్రివర్యులు కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ ఏకవచనంతో పత్రికల్లో రాయలేని మాటలు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఇక పెండింగ్ బిల్లుల విషయంలో మాజీ సర్పంచ్‌లు తమకు రావాల్సిన నిధుల గురించి అడిగితే పనులు ఎప్పుడు చేశారు? బిల్లులు ఎవరి హయాంలో అడుగుతున్నారంటేనే మీరు ఎంతటి అజ్ఞానంలో ఉన్నారన్న విషయం స్పష్టమవుతుందన్నారు. అధికారంలో ఉన్నవారు హుందాగా వ్యవహరించాలని, అహంకారంతో కాదనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. మాజీ సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉంటే ఓ కమిటీ వేసి ఎప్పుడు చెల్లిస్తారన్న విషయాన్ని తెలియజేయాలని, కానీ వారిని అక్రమంగా అరెస్టులు చేయించి పోలీస్ స్టేషన్లకు ఎందుకు తరలిస్తున్నారని ప్రశ్నించారు. కేశంపేటలో జరిగిన సమావేశంలో మండలానికి ఏం నిధులు ఇచ్చారన్న విషయాన్ని చెప్పడకుండా బీఆర్ఎస్, కేటీఆర్, అంజన్నలపై విషం చిమ్మడమే లక్ష్యంగా బూతులు తిట్టడం సరికాదన్నారు. హుందాగా మాట్లాడి ఎమ్మెల్యే పదవికి మన ప్రాంతానికి గౌరవాన్ని తీసుకురావాలని కోరారు.

యువకుడు అదృశ్యం

మొయినాబాద్, ఫిబ్రవరి11: ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన ప్రహాల్లాద్ (38), వృత్తి ఫొటోగ్రాఫర్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే ఈ నెల 10వ లంగర్ హౌస్‌లో ఫొటోలు, ఆల్బమ్స్ ఉన్నాయని వాటిని తీసుకురావడానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయిన ప్రమాల్లాద్ రాత్రి వరకూ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన అతడి భార్య మాల మంగమ్మ భర్త ఫోన్‌కు కాల్ చేయగా, ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండడంతో చుట్టు పక్కల ప్రాంతాలతోపాటు స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా భర్త ఆచూకీ లభించలేదు. 11వ తేదీ ఉదయం 9 గంటలకు భార్య మంగమ్మ వాట్సాప్‌కు వాయిస్ మెసేజ్ పెట్టి 2 ఏండ్ల తరువాత వస్తానని, పిల్లలను బాగా చూసుకోవాలని, ఇంటి వెనకాల ఉన్న ప్లాటు అమ్మి అప్పులు తీర్చాలని కోరినట్లు చెప్పారు. తన అక్క భర్తకు వాట్సాప్ ద్వారా కూడా నా కోసం వెతుక వద్దు...అని మెసేజ్ పెట్టినట్లు పేర్కొన్నారు. భర్త ఆచూకీ లభించకపోవడంతో భార్య మంగమ్మ మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరివేసుకుని మహిళ మృతి

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 11: భార్యభర్తల మధ్య గొడవ కారణంగా ఉరివేసుకుని భార్య మృతి చెందిన ఘటన చేవెళ్ల మండల పరిధిలోని ఎన్నెపల్లి గేటు సమీపంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి పల్లె గ్రామానికి చెందిన భార్యభర్తలు అనిత (30) భర్త బాబు బతుకు దెరువు కోసం సంవత్సరం క్రితం చేవెళ్ల మండంలోని ఎన్నెపల్లి గేటు వద్ద ఉన్న కోళ్లఫారంలో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా, సోమవారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ రావడంతో ఇంట్లోనే రాడుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బడ్జెట్ వ్యవసాయ రంగానికి వ్యతిరేకం

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11 : కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్ వ్యవసాయ, శ్రామిక రంగాలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సబ్సిడీలకు కోత పెట్టారని, ఒక్క ఎరువుల రాయితీలోనే రూ. 11వేల కోట్లు కోత విధించడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టలేకపోయారన్నారు. తెలంగాణ పేరే బడ్జెట్‌లో లేకపోవడం బాధకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పునః సమీక్షించాలన్నారు. లేదంటే కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తమ పదవులకు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన రూ. 2లక్షల రుణమాఫీ రైతులందరికీ అందలేదన్నారు. రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ. 7500 పంట పెట్టుబడి సాయం ఇస్తామని ప్రచారం చేసి ఇప్పుడు రూ. 6వేలకు కుదించి, జనవరి 26 నుంచి రైతు భరోసా పథకం అమలు చేస్తామని చెప్పి ఇప్పటి వరకూ రెండు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకే నిధులు జమచేయడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పంట సాగు చేస్తున్న రైతులందరి ఖాతాల్లో డబ్బులు వేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు చల్లా నారాయణరెడ్డి, బాల్‌రాజ్, బాల్‌రెడ్డి, పెంటయ్య, యాకయ్య ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి డప్పు దరువేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ సంబురాలు

కేశంపేట, ఫిబ్రవరి 11: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ అమలు విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ కేశంపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నేతలు మంగళవారం విజయోత్సవ సంబురాలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని చౌరస్తా నుంచి శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయం వరకు డప్పు దరువులతో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. అనంతరం ముఖ్యకూడలిలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎమ్మార్పీఎస్ పోరాట స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో వీరేశం, భాస్కర్‌గౌడ్, సురేశ్, శ్రీధర్, భీమన్న, గణేశ్, రాజు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌ముదిరాజ్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

షాబాద్, ఫిబ్రవరి 11: ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ముదిరాజ్ సంఘం షాబాద్ మండలాధ్యక్షుడు నానాజిపురం లింగం ముదిరాజ్ అన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన హైతాబాద్ గ్రామానికి చెందిన కావలి చంద్రశేఖర్‌ముదిరాజ్‌ను మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు లింగంముదిరాజ్ మాట్లాడుతూ... ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో నిలిచి ముదిరాజ్‌లు తమ సత్తా చాటాలని తెలిపారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల గౌరవ అధ్యక్షుడు కూర వెంకటయ్యముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పాలమాకుల మాసయ్యముదిరాజ్, సంఘం నాయకులు మల్లయ్యముదిరాజ్, శ్రీనివాస్‌ముదిరాజ్, మల్లేశ్‌ముదిరాజ్, శేఖర్‌ముదిరాజ్, గౌరీశ్వర్‌ముదిరాజ్, వెంకటయ్యముదిరాజ్, చంద్రయ్యముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి భూముల సర్వే



నక్కలపల్లి గ్రామం సమీపంలో ఈసీ వాగు వంతెన స్థలాన్ని సర్వే చేస్తున్న అధికారులు

మొయినాబాద్, ఫిబ్రవరి11: మొయినాబాద్ మండల పరిధిలోని నక్కలపల్లి, షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి, పోలిపేట్ గ్రామాల రెవెన్యూ గ్రామాల నుంచి ఉన్న ఈసీ వాగుపై వంతెన నిర్మాణం కోసం స్థలాన్ని మంగళవారం తహసీల్దార్ గౌతంకుమార్, సర్వేయర్ జలజ సర్వే చేశారు. నక్ష ప్రకారం ఉన్న రోడ్డును సర్వే చేయడంతో పాటు పక్కన పట్టాదారుల భూముల నుంచి వెళ్తున్న వంతెన స్థలాన్ని కూడా సర్వే చేసి వంతెన పనులు కొనసాగేలా అధికారులు చర్యలు చేపట్టారు. వంతెన పక్కన ఉన్న పట్టా భూములకు చెందిన వారు సర్వే చేయించుకోవడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటే సర్వే చేస్తామని, పనులు కొనసాగేలా నక్కలపల్లి గ్రామ ప్రజలు సహకరించాలని తహసీల్దార్ గౌతంకుమార్ గ్రామస్తులకు సూచించారు. అధికారులతో పాటు గ్రామానికి చెందిన నాయకులు గౌరి సతీశ్‌కుమార్, అంజయ్యగౌడ్, నీరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మరొకరు..

కొత్తూరు, ఫిబ్రవరి 11: చేపల వేటకు వెళ్లి చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్‌లోని పరిధిలోని జేపీ దర్గాను ఆనుకొని ఉన్న చెరువుద్ద మంగళవారం జరిగింది. కొత్తూరు సీఐ నరసింహారావు వివరాల ప్రకారం... మెల్లగూడ పంచాయతీ పరిధిలోని కాళ్లగూడ తండాకు చెందిన బోగ్య కుమారుడు రాజు (38) చేపల వేట కోసం జేపీ దర్గా వద్ద ఉన్న చెరువులోకి వెళ్లాడు. ప్రమాద వశాత్తూ కాలు జారి చెరువులో పడి మునిగిపోయాడు. కాగా, సోమవారం సాయంత్రం చెరువులో గజ ఈతగాళ్లు గాళింపు చేపట్టారు. ఫలితం లేకపోవడంతో మళ్లీ మంగళవారం ఉదయం చెరువులో గాలించగా, మధ్యాహ్నం రాజు మృతదేహాన్ని వెళికి తీశారు. గాళింపు చర్యలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అయితే మృతుడు రాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. రాజు తాగుడుకు బానిస కావడంతో భార్య అతిడిని వదిలేసి వెళ్లిందని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరసింహారావు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేస్తున్న టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ మహేందర్ గురు

ఆమనగల్లు, ఫిబ్రవరి 11: విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకుంటే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు ట్రస్మా వారు నిర్వహించిన పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమానికి టాస్క్ సీవోవో సుంకిరెడ్డి, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ మహేందర్ గురు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం 1200 మంది విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆమనగల్లు, తలకొండపల్లి మండల విద్యాధికారులు పాండు, చాంప్ల నాయక్, ట్రస్మా రాష్ట్ర అడ్వైజర్స్ టి. వెంకటయ్య, అల్లాజీగౌడ్, ఎ.నిరంజన్ ఆమనగల్లు ట్రస్మా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శివలింగం, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, కోశాధికారి రమేశ్, ట్రస్మా సభ్యులు మహముద్, సుధీర్‌రెడ్డి, శేఖర్, వెంకటేశ్, తిరుమలేశ్, ఆంజనేయులు, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, సువర్ణ, జంగయ్య, చంటి, మల్లేశ్, బిజ్జు, రమేశ్, ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, అభినవ్‌రెడ్డి, రాజశేఖర్, కొండల్‌రెడ్డి, కృష్ణయాదవ్ ఉన్నారు.

కంప్యూటర్ సైన్స్‌లో రాణించాలి

విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11 : విద్యార్థులు కంప్యూటర్ సైన్స్‌లో మెళకువలను నేర్చుకోవాలని సంజయ్‌గాంధీ మెమోరియల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి ఎం.బాలాజీ అన్నారు. మండల పరిధి గుంతపల్లిలోని సైంటిఫిక్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ అకాడమిలో జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్, కెరీర్ గైడెన్స్ ఇగ్నయిటి (2K25) పేరుతో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కళాశాల జనరల్ సెక్రటరీ ప్రియాంక, హెచ్ఆర్ డైరెక్టర్ వై జయప్రదతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఎంచుకున్న రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఉమామహేశ్వరరావు, రామచంద్రారెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, పౌర సంబంధాల శాఖ అధికారి శ్రీనివాస్‌నాయుడు, ఏవో సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

వృథాగా మంచినీరు..

చంపాపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు రోడ్డులో మంచినీళ్లు వృథాగా పోతున్నాయి. మంచినీటి పైప్‌లైన్ మ్యాన్‌హోల్స్ జంక్షన్ల మరమ్మతులు చేపట్టడంతో వాటర్ పైప్‌లైన్ పగిలి తాగునీళ్లు రోడ్డుపై వృ థాగా పారుతున్నాయి.

– చంపాపేట, ఫిబ్రవరి 11

ఎంపీటీసీ, జడ్పీటీసీ ముసాయిదా విడుదల

ముసాయిదా విడుదల చేస్తున్న మండల పరిషత్ కార్యాలయం ఉద్యోగులు

కేశంపేట, ఫిబ్రవరి 11: మండలంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల ముసాయిదాను మండల పరిషత్ అధికారులు మంగళవారం విడుదల చేశారు. మండలంలో మొత్తం 12ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి సంబంధించిన ముసాయిదాను విడుదల చేసినట్లు ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయా పోలీస్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యరంతరాలు ఉంటే ఈ నెల 13వరకు స్వీకరిస్తామన్నారు. అనంతరం అన్ని పార్టీల నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సలహాలు, అభ్యంతరాలను స్వీకరించి ఉన్నతాధికారులకు అందజేస్తామని, ఈ నెల 15న తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటిస్తామన్నారు.

దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 11: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్సీడీఈ)లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పీజీఆర్ఆర్సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి తెలిపారు. యూజీసీ నిబంధనల మేరకు వివిధ కోర్సులకు ప్రతి ఏటా రెండు దఫాలుగా ప్రవేశాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా రెండో దఫా మార్చి 31వ తేదీ వరకు ప్రవేశాలు నిర్వహిస్తామని ప్రకటించారు. వివిధ పీజీ, యూజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులతో కలిపి మొత్తం 72 ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. కోర్సుల వివరాలు, నిబంధనలు, ఫీజు వివరాలు తమ వెబ్ సైట్ www.oucde.netలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అందులో లాగిన్ అయి దరఖాస్తు ఫారం నింపాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు, కోర్సు ఫీజు, పరీక్ష ఫీజులను ఆన్‌లైన్ విధానంలోనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 88861 11690, 040-27097177, 040-27098350 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఈ నెల17 నుంచి సెల్ఫ్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 11: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్(సెల్ట్)లో ఈ నెల 17వ తేదీ నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవీన్ సౌడ